క్లుప్తంగా

ఓటరు జాబితా విడుదల

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లుగా 6,255 మంది నమోదై ఉన్నారని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి పి.మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మార్చి 13న జరగనున్న ఎన్నికలకు సమాయత్తమైనట్లు వివరించారు. జి.సిగడాం మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాల పోలింగ్ బూత్‌లో 1,235 మంది ఓటర్లు, లావేరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1,195 మంది, రణస్థలం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 1,670 మంది, ఎచ్చెర్లలోని బీఆర్‌ఏయూలో 2,155 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా వార్షికోత్సవ పూజలు గురువారం నిర్వహించారు. పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో భజరంగదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి యశ్వంత్ గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతినెలా వైద్య పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. గ్రామాల్లోని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న రఘురాం

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వజ్జి పత్తి రఘురాం సూచించారు. మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్నారన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మీసాల రామకృష్ణ, జి.అప్పలరాజు, టి.గౌరినాయుడు, పొగిరి దశరథి పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు


బాబాకు పూజలు చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో షిరిడీ సాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, నాయకులు చిత్తిరి మోహన్, కర్రి వైకుంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలంలోని చిలకపాలేం, ఎస్‌ఎస్ ఆర్‌పురం గ్రామాల్లోని బాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. బాబా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: మండలంలోని ఎచ్చెర్లలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధులను శుభ్రం చేసి రహదారులకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. కాలువల్లో మురికితీత పనులను చేపట్టి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌లకు తరలించారు. పనులను సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం రేపు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు స్వామివారి వద్ద పూజచేసి ఉంచి పెన్నులు, కంకణాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభకు పరీక్ష

- బీ సర్టిఫికెట్ కోసం నేడు ప్రాక్టికల్స్, రేపు థియరీ పరీక్షలు
- 12 విద్యాసంస్థల నుంచి 382 మంది సన్నద్ధం
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఎన్‌సీసీ అధికారులు


వెపన్ షూటింగ్ సాధనలో ఎన్‌సీసీ క్యాడెట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ:

నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ప్రతిభా ప్రావీణ్యత పరీక్షకు రంగం సిద్ధమైంది. ఎన్‌సీసీ–బీ సర్టిఫికెట్ కోసం ఏడాదికాలంగా సన్నద్ధమౌతున్న క్యాడెట్లకు శుక్రవారం ప్రాక్టికల్ పరీక్షలు, శనివారం థియరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పరిసరాలను శుభ్రపరిచి, టెంట్లు వేసి, మార్కింగ్‌లు వేసి సిద్ధం చేశారు. కల్నల్ నౌతియాల్ (2వ ఆంధ్రా బాలికల బెటాలియన్ విజయనగరం) పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి. 14వ ఆంధ్రా బెటాలియన్ శ్రీకాకుళం యూనిట్ కమాండింగ్ అధికారి కల్నల్ అమిత్ బెనర్జీ, సుబేదార్ మేజర్ గిరీష్, హవల్దార్లు, ఎన్‌సీసీ అధికారులు హాజరుకానున్నారు.

ప్రావీణ్యతే ప్రామాణికం..

బెటాలియన్ పరిధి శ్రీకాకుళం యూనిట్ నుంచి బీ–సర్టిఫికెట్ కోసం 382 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు సన్నద్ధమవుతున్నారు. వీరికి 500 మార్కులకు పరీక్షలు జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలకు 135 మార్కులు కేటాయిస్తుండగా, థియరీ పరీక్షలకు 365 మార్కులకు కేటాయిస్తున్నారు. ఇకపోతే ప్రతి విభాగంలో 40 శాతం మార్కులు సాధించిన క్యాడెట్లు ఉత్తీర్ణత సాధించి.. సి–సర్టిఫికెట్‌లో చేరేందుకు అర్హత సాధించనున్నారు. నేడు జరిగే ప్రాక్టికల్స్‌లో మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, ఫుట్ డ్రిల్, కమ్యూనికేషన్ తదితర అంశాల్లో పరీక్షలు జరుగుతాయి. ఇందులో ప్రతిభా ప్రావీణ్యతను కనబర్చిన క్యాడెట్లకు మంచి మార్కులు కేటాయించనున్నారు.

12 విద్యా సంస్థలు ఇవే..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా, పొరుగు ప్రాంతాల నుంచి మొత్తం 12 విద్యా సంస్థల నుంచి 382 మంది బీ–సర్టిఫికెట్ కోసం పరీక్షలకు హాజరుకానున్నారు. 1. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, 2. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, 3.గాయత్రి డిగ్రీ కళాశాల బాలురు, 4. గాయత్రి డిగ్రీ కళాశాల బాలికలు, మునసబ్‌పేట, 5.నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 6.పాతపట్నం మహేంద్ర డిగ్రీ కళాశాల, 7.కాశీబుగ్గ ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాల, 8.పార్వతీపురం ఎస్‌వీడీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 9. గరివిడి ఏడీఎస్ డిగ్రీ కళాశాల, 10. రాజాం జీసీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల. వీటితోపాటు సెల్ఫ్ ఫైనాన్స్ కింది మరో రెండు కళాశాలలు 11. టెక్కలి ఐతమ్ ఇంజనీరింగ్ కాలేజ్, 12. రాజాం జీఎంఆర్ ఐటీ కాలేజ్‌ల నుంచి క్యాడెట్లు హాజరుకానున్నారు.


ప్రాక్టికల్స్ జరిగే ప్రదేశం వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

ఏర్పాట్లు పూర్తిచేశాం..

ఎన్‌సీసీ బీ–సర్టిఫికెట్ క్యాడెట్ల పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. శుక్రవారం ప్రాక్టికల్స్, శనివారం థియరీ పరీక్షలు జరుగుతాయి. 12 కళాశాలల నుంచి 382 మంది క్యాడెట్లు ఈ పరీక్షలకు హాజరవుతారు. కల్నల్ నౌతియాల్ ఆధ్వర్యంలో పరీక్షలు జరుగుతాయి. 14వ ఆంధ్రా బెటాలియన్ అధికారులు సీవో కల్నల్ అమిత్ బెనర్జీ పర్యవేక్షిస్తారు.

– లెఫ్టినెంట్ డాక్టర్ వై.పోలినాయుడు, ఎన్‌సీసీ అధికారి, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

నాణ్యమైన ఆహారం అందించడమే ధ్యేయం


బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న ఆహార భద్రతా కమిషన్ సభ్యుడు కాంతారావు


వప్పంగిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కమిషన్ సభ్యుడు, డీఈఓ


- ఆహార భద్రత కమిషన్ సభ్యుడు బి.కాంతారావు
- నగరంలో ఆకస్మిక తనిఖీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు బి.కాంతారావు అన్నారు. ఆహార భద్రత చట్టం అమలు తీరు పర్యవేక్షణ నిమిత్తం గురువారం జిల్లా కేంద్రంలోని రేషన్ షాపు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. వాంబే కాలనీ వద్ద ఎండీయూ వాహనంలో విక్రయిస్తున్న బియ్యాన్ని పరిశీలించిన ఆయన.. సిబ్బందితో మాట్లాడుతూ చిన్న చిన్న పొరపాట్లు సైతం పునరావృతం కాకూడదన్నారు. వాహనంలో నిల్వలు, గొడౌన్ స్టాక్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గూనపాలెం సెక్టార్, దండి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పిల్లలకు తయారు చేసిన ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వప్పంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పేదరికంతో చదువులకు దూరం కాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారని చెప్పారు. పోషక విలువలతో కూడిన పోర్ట్ ఫైడ్ రైస్‌ను విద్యార్థుల కోసం అందిస్తున్నట్లు వివరించారు. పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఆహార సమస్యలు ఏమైనా ఉంటే 9966242414 నంబర్‌కు తెలియజేయవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేసే అక్షయపాత్ర సెంట్రలైజ్డ్ కిచెన్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జయంతి, డీఎస్‌ఓ డి.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.అనంతలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, డీటీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయికి విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్:

బొందిలిపురంలోని దర్బార్ షిరిడీసాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మ ఆధ్వర్యంలో స్వామివారికి హారతులు, ప్రత్యేక అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పూజలందుకుంటున్న సాయినాథుడు

కోటదుర్గమ్మకు పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

లావేరు: మండలంలోని పెద్ద కొత్తకోట గ్రామంలో కోటదుర్గమ్మ ఆలయం వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, నాయకులు మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు, గొర్లె సూర్యనారాయణ, జగ్గరోతు రాము తదితరులు పాల్గొన్నారు.

సిక్కోలు ఘనకీర్తిని చాటిచెప్పాలి


కరాటే పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఎస్సైలు, నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సీఎం కప్ క్రీడాపోటీలకు జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 9 నుంచి 12 వరకు విశాఖ పట్టణంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం వేదికగా మొదలైన అంతర్జాతీయ ఓపెన్ చాంయన్‌షిప్ సీఎం కప్ – 2023 పోటీల్లో శ్రీకాకుళం నగరంలోని మహాలక్ష్మీనగర్ కాలనీలోని శ్రీకాకుళం కెన్యురియో కరాటే విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పోటీల కోసం పయనమైన క్రీడాకారులను ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మణరావు, రెండో పట్టణ ఎస్‌ఐ వెంకటేశ్వరరావులు అభినందించి, వీడ్కోలు పలికారు. అండర్–10, 12, 14, 16తో పాటు అండర్–20లో మొత్తం 20 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని కరాటే చీఫ్ కోచ్ రెడ్డి ఢిల్లేశ్వరరావు తెలిపారు. పోటీలలో సత్తాచాటి సిక్కోలు ఘన కీర్తిని చాటిచెప్పాలని ఎస్సై లక్ష్మణరావు పిలుపునిచ్చారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

లావేరు: పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని మురపాక శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో గురువారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఉపయోగపడే అన్నిరకాల పుస్తకాలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు ఉచితంగా వ్యాక్సిన్లు


మేకలకు వ్యాక్సినేషన్ చేస్తున్న దృశ్యం

లావేరు: గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా పీపీఆర్ వ్యాక్సిన్ వేయడం జరుగుతోందని పశువైద్యురాలు డాక్టర్ జి.లావణ్య, వెటర్నరీ జూనియర్ అధికారి రవికుమార్ తెలియజేశారు. మండలంలోని వెంకటాపురం, లింగాలవలస, బెజ్జిపురం తదితర గ్రామాల్లో గురువారం వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాక్సిన్లను పెంపకందారులు వినియోగించుకోవాలని సూచించారు.

22న విజయేంద్ర సరస్వతి రాక

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని బాలాత్రిపుర సుందరీ దేవీపీఠం దేవాలయానికి కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఈ నెల 22న రానున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 22 నుంచి 26 వరకు ఆలయం వద్ద ఉంటారని, మహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామికి ప్రతి రోజూ అభిషేకాలు, త్రికాలార్చనలు జరుగుతాయని వివరించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

హిరమండలం: అనుమతి లేని పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని పలాస వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) ఎల్.వి. మధుబాబు అన్నారు. గురువారం హిరమండలంలోని ఎరువుల షాపులను తనిఖీచేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్సు, జీఎస్టీ కలిగి ఉండాలన్నారు. కాలం చెల్లిన లైసెన్సులతో వ్యాపారం చేయకూడదన్నారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం నిల్వలు సరిపోవాలన్నారు. రైతులకు విధిగా బిల్లుల రసీదు ఇవ్వాలని, ఈ పాస్ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- సంచాం సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం


ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ప్రజా సమస్యల పరిష్కారమే గడప గడపకూ మన ప్రభుత్వం లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని సంచాం గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. వీధుల్లో కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. దీంతో సంచాం గ్రామాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తానని ఎమ్మెల్యే తెలియజేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో కాలువలు నిర్మిస్తామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ టొంపల సీతారాం, మండల నాయకులు పెదరామినాయుడు, లంకలపల్లి ప్రసాద్, గొర్లె అప్పలనర్సునాయుడు, చిల్ల వెంకటరెడ్డి, చినరామినాయుడు, సంచాం సర్పంచ్ రెడ్డి సూర్యకాంతం, రెడ్డి రాము, రెడ్డి రామకృష్ణ నాయుడు, పతివాడ అప్పలనాయుడు, రెడ్డి ఆనంద్, మీసాల దాలినాయుడు, రాము, రెడ్డి సూరపునాయుడు, పప్పల వెంకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వాడలో సమస్యలు పరిష్కరించండి


కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: అణు విద్యుత్ ప్రాజెక్టు జాప్యం జరుగుతుండడం వలన కొవ్వాడ పంచాయతీలో సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను గురువారం కలిసి సమస్యలు తెలియజేశారు. పంచాయతీలో మౌలిక వసతులు కల్పించడానికి నిధులు లేకపోవడంతో అపారిశుద్ధ్యం నెలకొందన్నారు. రహదారులు పాడైపోయాయని, విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో కొత్తగా వివాహాలు కావడంతో ఇళ్లు నిర్మిస్తున్నారని, పునరావాస కాలనీ నిర్మాణ పనులు శరవేగంగా జరపాలని కోరారు. పెండింగ్ భూముల పరిహార చెల్లింపులు వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఇప్పటికే సమస్యలపై సీసీఎల్‌కు ఫైల్ పంపించడం జరిగిందన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మాణంపై నిధులు విడుదలయ్యాయని, కానీ ఇంకా ఉత్తర్వులు రాలేదని చెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి అణు విద్యుత్ సమస్యలు, మౌలిక వసతుల కల్పన వంటి సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. అతనితో పాటు రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి పెదరామినాయుడు, జరుగుళ్ల శంకరరావు, మురళీధర్ బాబా, అల్లు కన్నబాబు, అల్లిపల్లి అప్పన్న, గురువులు, పట్టయ్య, నాగేంద్ర ప్రసాద్, రాముడు, నర్సింహులు, మల్లిబాబు, సూరాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెనూ పాటించాలి


మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, సంక్షేమ హోమ్‌లలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను విధిగా అమలు చేయాలని, ప్రతి నెలా ఆరోగ్య తనిఖీలు చేయించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు ఆదేశించారు. గురువారం జిల్లా న్యాయ న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం న్యాయ సేవాసదన్‌లో జిల్లా ట్రైబల్, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ మెనూ, వసతి సౌకర్యాలపై సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.గడ్డమ్మ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనురాధను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇకపై ప్రతి నెలా వెల్ఫేర్ హాస్టల్స్ వెల్ఫేర్ హోమ్స్‌ను సందర్శిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిని కలిసిన రెవెన్యూ ప్రతినిధులు


వినయ్‌భూషణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘ సభ్యులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ న్యాయవాది ఎం.వినయ్‌భూషణ్‌ను ఆయన కార్యాలయం వద్ద రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు గురవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూశాఖకు సంబంధించి కోర్టుల్లో దాఖలవుతున్న కేసుల విషయంలో సరైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు, గార తహసీల్దార్ ఎస్.సుధాసాగర్, డబ్బీరు వాసుదేవరావు పాల్గొన్నారు.

పారామెడికల్ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం రూరల్: బీఎస్సీ పారా మెడికల్ ఫలితాల్లో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన ఈ ఫలితాల్లో షహీనా బేగం షైలాస్ లిడియా అనస్థీషియా విభాగంలో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో 40 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. తృతీయ సంవత్సరంలో 17 మంది ప్రథమ శ్రేణిలో పాసయ్యారని చెప్పారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

హెల్మెట్ ధారణ తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ విధిగా ధరించాలని ట్రాఫిక్ ఎస్‌ఐలు వెంకటేశ్వరరావు, సోమశేఖర్, లక్ష్మణరావు, రమణమూర్తి సూచించారు. గురువారం శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్, 80 అడుగుల రోడ్డు తదితర ప్రాంతాల్లో వాహనచోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు.హెల్మెట్ ధారణతో రోడ్డు ప్రమాదాలు సంభవించేటప్పుడు ప్రాణరక్షణ కలుగుతుందన్నారు.

• కరుణించు దేవా..!



నగరంలోని బాపూజీ కళామందిర్‌లో 6వ ఏసయ్య విమోచన పండగలు గురువారంతో ముగిశాయి. పీస్ అండ్ రిజాయిస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో పాస్టర్ చల్లా కరుణాకరరావు శాంతిసందేశం వినిపించారు. రాజమండ్రికి చెందిన పాస్టర్ జోసెఫ్ ఎడ్వర్డ్ దైవ సందేశం అందించారు. అంతకుముందు కల్వరీ క్వయిర్ బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కె.సూర్యనారాయణ, ఎస్తేరు రాణి, కొర్నేలి, జి.సైమన్, ఆర్.పాలు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్